# హత్య!

అని

పతాక శీర్షికలతో

పత్రికలు అరవలేదు.

గుర్తుతెలియని శవం!

అని ఏమూలో

ప్రచురించబడలేదు.

ఎవర్నోచంపి

పడేసారు తెల్సా!

అని ఎవ్వరు చెప్పుకోలేదు.

ఏ పోలీసు స్టేషన్‌లోను కేసు నమోదుచేయబడ లేదు.

ఎవ్వరికి ఏమీ తెలియదు.

ఎవ్వరికి ఏ అనుమానము లేదు.

అందుకే

అదెంతో ఘోరమైన హత్య అంటాను.

ఎంతో రహస్యంగా, మూడోకంటికి తెలియకుండ, చాల నిశ్శబ్దంగ, అరుపులు ఆక్రందనలు లేకుండ జరిగిపోయింది.

అందుకే

అదెంతో ఘోరమైన హత్య అంటాను.

మీకు మొదటినుండి చెపితేగాని అర్ధంకాదు.

అసలు ఆరోజుదాక ఆ అగంతకుని ఉనికి సుబ్బారావుకు తెలియదు.

తనను నీడలాగ వెన్నాడే మరొకవ్యక్తి ఉన్నాడనే ఊహేలేదు అతనికి.

ఆరోజు;

ఆఫీసుకెళ్ళడానికి, సుబ్బారావు రోడ్డుమీద నిల బడ్డాడు. బస్సురానందుకు విసుగ్గా ఉంది. అంతలో ఎవరో ఒకామెవచ్చి నిలబడింది. సుబ్బారావుకు విసుగు పోయింది. అందమైన ఆమె వంపుల్లో అతనిచూపు ఇరుక్కుపోయింది. ఆచూపు గుచ్చుకున్నదేమో, ఆమె పైటసవరించుకుంది. మెదలకూడని దురాలోచన అతని మనసులోమెదిలింది. పెదాలు నాలుకతో తడుపు కున్నాడు.

''సుబ్బారావ్!''

ఛెళ్ళున కొరడాలా పిలుపు వినబడింది.

ఉలిక్కిపడి వెనుదిరిగి చూసాడు.

ఎవ్వరూ లేరు.

అంతలోకి బస్సు వచ్చింది.

జనం ఎగబడ్డారు.

జనంలో కల్సిపోయిన సుబ్బారావు ఆ విషయం మర్చిపోయాడు.

సుబ్బారావు మధ్య తరగతి మనిషి. కలెక్టరాఫీసులో గుమాస్తా. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు వున్నారు. ఉన్నంతలో సుఖంగానే బ్రతుకుతున్నాడు. ఇప్పుడే అవసరాలు పెరుగుతున్నాయి. దానికితోడు కొత్త అలవాట్లు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఈ మధ్య ఫ్రెండ్స్‌తో కలిసి బార్‌కెళ్ళి ఎంజాయ్ చేసి ఆధునిక సమాజంలో చేరాడు. క్లబ్బు మెంబరుగా చేరి మరింత గౌరవం పొందాలనే ఊహలో కూడా ఉన్నాడు.

అందుకనే-

అంతవరకు లంచంతీసుకునేవాళ్ళను అసహ్యించుకునే సుబ్బారావు, ఆదర్శాలుపలికే సుబ్బారావు, తన మంచితనం పిరికితనమనే నిర్ణయానికొచ్చి తొలిసారిగ లంచంపట్టాడు.

ఆక్షణంనుండే

ఆ నీడ

అతన్ని వెంటాడటం ప్రారంభం.

దూరంగ టీబంక్ వద్ద జనం ఉన్నారు. కాని వాళ్ళధ్యాసలో వాళ్ళున్నారు.

''అక్రమ ఆర్జన నిలువదు సుబ్బారావ్''

సుబ్బారావుకు భయంవేసింది.

వడిగ ఆఫీసువైపు నడవడం సాగించాడు.

''ఆగు! తొందరేముంది''

రాయిలా నిలబడ్డాడు. సన్నగ వణుకు వెన్నుపూసలో.

మళ్ళీ చుట్టు చూసాడు.

ఎవ్వరు లేరు.



ఒక పేదబడిపంతులు పెన్షన్‌ఫైలు చాలారోజులు తొక్కిపట్టి చివరకు బైటకుతీసాడు. దాన్ని ఆఫీసరు వద్దకు పంపి సంతకంపెట్టించినందుకు రెండొందలు తీసుకున్నాడు.

ఆఫీసుబైట, వేపచెట్టుకింద ఎవ్వరుచూడకుండ

వెయ్యివాపి, డబ్బందుకున్నాడు.

"రేపురా! అంత అయిపోయింది" అని ఆయన్ని పంపించి, సిగరెట్ ముట్టించి తాపీగ పొగ పీల్చాడు.

"సుబ్బారావ్"

అని వినిపించింది.

చుట్టు చూసాడు.


ఎవ్వరు లేరు...

"నువ్వు చేసింది చాలతప్పు"

ఎవరు, తననుపిలిచేది

అదిరే గుండెతో మళ్ళీ చుట్టు చూసాడు.





ఎవ్వరు లేరు.

"పరుల కష్టాలను సొమ్ముచేసుకోకూడదు"

ఎవరుపలికేది.

ఎవరు లేరు.

ఎవ్వరు లేరా?

నమ్మకంకుదిరి వెయ్యివాసాడు.

లంచం అందుకున్నాడు.

"సుబ్బారావ్" అనే పిలుపు వినబడలేదు.

చుట్టు చూసాడు.

అతన్ని భయపెట్టే ఏ నీడలేదు.

అదేమిటి తన వెనుక.

వల్లగా, పొడుగ్గా, భయంగా—

తనలో చీకటి నింపుతూ.

"గుర్తుపట్టావా సుబ్బారావ్"

అంది అతని నీడ నవ్వగా నవ్వుతూ—

ఒక్క ఉదుటున సీట్లోకొచ్చి పడ్డాడు.

దడ తగ్గిన తర్వాత, పక్కసీట్లలోని తన మిత్రుల అండ ధైర్యాన్నిచ్చిన తర్వాత నెమ్మదిగ వెనుదిరిగి, చూసాడు.

ఎవ్వరూ లేరు.

ఆ తర్వాత సుబ్బారావు కొన్నాళ్ళు లంచం పట్టలేదు.

ఎప్పుడు అవకాశం వచ్చినా, వెయ్యి చాపుదామంటే, సుబ్బారావ్! అనే పిలుపు వినబడుతుందేమోననే భయం.

ఒక నెల గడిచేసరికి ఆ అనుభవం పాతదయిపోయింది.

తన భయం తన పిరికితనం వల్లేనని, తను అనవసరంగా అవకాశాలు పోగొట్టుకొంటున్నానే మోననే ఆలోచన మొదలయింది. అదీకాక, రోజు బార్ కెళ్ళడం అలవాటయింది. క్లబ్‌లో పేకాట. డబ్బులకు బాగా ఇబ్బందిగా ఉన్నది...

తన బలహీనత, పిరికితనమే తనను వెక్కిరిస్తుందనే

హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాడు.

హాయిగ మనసార నవ్వుకున్నాడు.

ఆ రాత్రి మిత్రులకు పార్టీ ఇచ్చాడు.

చాలా ఆనందంగ, గడిపాడు.

పొద్దుపోయాక, తూలుతు ఇంటికి బయలుదేరాడు.

మిత్రులు రిక్షా ఎక్కమన్నారు కాని, వల్లగాలికి నడిస్తే మైకందిగుతుందనే ఉద్దేశ్యంతో నడకసాగించాడు.

వీధి నిర్మానుష్యంగా ఉంది.

అడుగులు బరువుగ పడుతున్నాయి.

వంట్లో మందువెచ్చదనం, చుట్టు రాత్రివల్లదనం—.

"సుబ్బారావ్"

హఠాత్తుగా ఆగిపోయాడు.

మత్తు దిగింది.

వేడి తగ్గింది.

చలినిండింది గుండెలో—.

ఆ లైట్‌కింద ఆగిన సుబ్బారావు వెనుక వల్లగ దూరంగ పరుచుకున్న నీడ— వెనక్కు తిరిగి చూసే ధైర్యం లేదు.

"వాళ్ల కన్నీటిని డబ్బుగా మార్చుకున్నావ్, దాన్ని విస్కీగా మార్చితాగావ్, వాళ్ళ కష్టార్జితం నీకు విలువ దని తెలిసికూడ ఎందుకాశించావ్"

"ఎవ్వరు, ఎవ్వరునువ్వు! నావెంట ఎందుకిట్లాపడ తావ్"

"నేనెవ్వరో నీకు తెలియాదా?"

"తెలియదు"

"నిజంగా తెలియదా?"

మౌనం.

"నీకుతెలియకుండా నా ఉనికిలేదు"

"నన్నెందుకిట్లా వెంటాడుతావు"

"మరేంచెయ్యను. నీవెంటేనేను. నువ్వు పుట్టిన ప్పుడే పుట్టాను. నువ్వు పోయేదాక ఉంటాను; నీతోడు, నీడనేనేగా!"

"అబద్ధం. నాకెప్పుడూ నువ్వు కనబడలేదు. ఇప్పుడే నన్ను వేధిస్తున్నావ్! ఎందుకు?"

"ఇప్పటిదాక నా అవసరంలేదు సుబ్బారావ్, నా ఉనికి నీకు గుర్తుచేయ్యాల్సిన పనిబడలేదు. మీఅమ్మ నీకు గుర్తుందా"

"ఎందుకు లేదు"

"మా అబ్బాయి అందరిలాంటివాడు కాదు, మంచి వాడు. అని మురిసిపోయేది. మీ అత్తమామ ఆస్తిపాస్తులు లేకపోతేనేం, పిల్లాడుబుద్ధిమంతుడని పిల్లనిచ్చారు. మరి మీ ఆవిడ ఎంతమురిసిపోయింది నీమంచినను తనదైనందుకు. ఏడీ? ఆ సుబ్బారావు. వాడిలో ఎప్పుడైతే మార్పొచ్చిందో అప్పుడే నా అవసరం ఏర్పడింది. అందుకే బైటికొచ్చాను—"

"వచ్చి నన్నువేధిస్తున్నావ్"

"లేదు. నిన్ను మళ్ళీ మనిషినిచేద్దామని"

" పిరిగ్గా, ఇరుకుబతుకులో పెడదామని"

''లేదు. నువ్వు నిర్మలంగ నిద్రపోయి ఎన్నాళ్ళ యింది''

''నేను హాయిగ ఆనందపడి!''

''ఏమిటా ఆనందం?''

''నేను పిచ్చివాడివి. లేకపోతే నీడతో మాట్లాడట మేమిటి?''

''తప్పించుకోకు. నువ్వు మారకపోతే దెబ్బతింటావ్, ఎదురుదెబ్బతగిలాక విచారించి లాభంలేదు. నువ్వు లంచాలు తీసుకోవడం మానాలి''

''మానను... మానను...''

సుబ్బారావు అరుస్తూ కిందికి వంగి, రాయందుకుని, పైకి వేగంగ లైట్‌మీదికి విసిరాడు.

బల్బుపగిలిపోయింది. నీడ చీకటిలో కలిసిపోయింది.

సుబ్బారావు వెర్రిగానవ్వాడు.

పీడవిరగడయింది...

''నీకింక అర్థంకాలేదు సుబ్బారావు. నేను నీతోటే ఉంటాను. ఉన్నాను. కాంతి ఉన్నప్పుడయితే కనబడతాను. లేకపోతే లేదు. నీ చర్మ చక్షువులకు ఏ వస్తువు కనబడాలన్నా కాంతి అవసరం. నాపట్లకూడ అంతే అనుకుంటున్నావు నువ్వు. కాంతిని పగలకొట్టి, కళ్ళను పొడుచుకున్నంత మాత్రానా, నేను లేననా! ఉన్నాను, ఉంటాను. నువ్వు ఋజుమార్గానికి కొచ్చినదాక నిన్ను వెంటాడుతాను-''

సుళ్ళుతిరుగుతు, చీకటి, సుడిగుండంలా సుళ్ళు తిరుగుతు, అతని చుట్టు చీకటిలోనుంచి మాటలు సుడులు తిరుగుతు-.

ఆ చీకటినుండి - ఇంటివైపు - వెలుగువైపు పరుగెత్తాడు సుబ్బారావు.

సుబ్బారావు ఋజుమార్గాన పడలేదు.

లంచాలు మానలేదు.

నీడ అతనితో పట్టుపడుతూనే ఉంది.

కాని అతను లొంగలేదు.

సుబ్బారావు ఒక విషయం గమనించాడు.

ఒంటరిగ ఉన్నప్పుడే ఆనీడ అతన్ని వేధిస్తుంది.

కనుక వీలైనంతవరకు ఒంటరిగ ఉండకుండా స్నేహాలు, వ్యాపకాలు పెంచుకున్నాడు.

ఐతే ఆనీడ పీడ మరొకరకంగ తీరింది.

సుబ్బారావును లంచం తీసుకునేటప్పుడు పట్టుకుని సస్పెండ్ చేసారు.

ఉద్యోగం పోయింది.

మనసుగొడ తీరిందిగాని,

ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయి.

సుబ్బారావుమీద దయతలచి, క్లబ్బులో పరిచయమున్న ఒక కంట్రాక్టరు గుమ్మస్తాగ పెట్టుకున్నాడు.

ముఖ్య అవసరాలకే సరిపోయే జీతం.

ప్రతిదీ సర్దుకుపోవాలి.

దురలవాట్లకు వీలులేదు.

ఎదురుదెబ్బ, ఆ గాయం ఇంకమానలేదు.

సుబ్బారావు పరిస్థితుల ప్రభావంవల్ల మారాడు...

ఇట్లా రెండేళ్ళు గడిచాయి.

కంట్రాక్టర్ స్కూటర్ ఏక్సిడెంట్‌కులోనయి, రెణ్ణెల్లు హాస్పిటల్‌లో గడిపాడు.

అంతవరకు నమ్మకంగ ఉన్న సుబ్బారావు ఆయన కింద గొయ్యితవ్వాడు.

ఆ రాత్రి

దొంగలెక్కలు తయారుచేస్తున్నాడతను.

''సుబ్బారావ్''

ఈసారి వెనక్కుతిరగి చూడలేదతను. ఆపిలచేదెవరో అతనికితెలుసు

''అన్నంపెట్టిన చెయ్యి సుబ్బారావ్''

అతనువంచిన తలెత్తలేదు. చేస్తున్నపని ఆపలేదు

''కృతఘ్నుడి శవం కుక్కలుకూడ ముట్టవంటారు''

అతను మాట్లాడలేదు.

'ఒక్కక్షణం ఆలోచించుకో, ఆయనే నిన్ను దగ్గరకు తీయకపోతే ఏమైపోయేవాడివి. నిన్నెంతమర్యాదగ చూసాడు. స్నేహితుడిలా గౌరవించాడు. అలాంటి మనిషికి ద్రోహం తలపెట్టావ్-. ఇంత దిగజారిపోతావనుకోలేదు''

సుబ్బారావు కలం ఆగిపోయింది.

తలెత్తి నిశతంగ చూసాడు.

అతని మనస్సులో ఒక ఆలోచనమెదిలింది.

''వద్దు - ఆపనిమాత్రం చెయ్యకు, మరీ దిగజారిపోతావ్''

ఆక్రందన విన్పించిందా కంఠం-.

నిర్లిప్తిగానవ్వుకుంటు, తనపనిలోమునిగిపోయాడతను.

సుబ్బారావు కంట్రాక్టరును రెండు లక్షలకు ముంచి ఉద్యోగం మానేసాడు.

స్వతంగ కంట్రాక్టులు చెయ్యడం ఆరంభించాడు. స్వంత ఇల్లుకట్టాడు. స్కూటరుకొన్నాడు. కాని తృప్తి లేదు. ఇంకా సంపాదించాలి, ఇంకాపైకి పోవాలి; కార్లలో తిరగాలి, విమనాల్లో విహరించాలి-.

చాలాకష్టపడి పెద్దకంట్రాక్టు సంపాదించాడు.

అందినచోటల్లా అప్పుచేసి పనిసాగించాడు-.

మధ్యలో కొత్త ఇంజనీర్ వచ్చాడు.

పని బాగుండలేదని పేచీపెట్టి బిల్లులు ఆపాడు.

డబ్బు ఆశచూపాడు లొంగలేదు.

రాజకీయనాయకుల్ని పట్టుకుని బదిలీచేయించాలని చూసాడు-

కుదరలేదు.

ఎలా సాధించాలి-.

అతనికేం బలహీనతలున్నాయి-. ? -.

చేటి ఆసరాతో పనిచక్కబెట్టుకోవాలి?-

చివరకు బంట్రోతుద్వారా అసలు విషయం తెలిసింది-.

అతను స్త్రీలోలుడు-.

''మీకు తెలియందేముంది సార్! బజారుసరుకుతో సరిపెట్టేరు. మొదటికే మోసం!... అయ్యగారికి వాళ్ళంటే అసహ్యం... సంసారపక్షంగ ఉండాలి. ఈ మధ్య సినిమాహాళ్ళో మీరు అమ్మగారు కనబడ్డారట-ఆమె అందాన్ని ఒకటేమెచ్చుకోవడం, మీరు ఆయన్ని డిన్నర్‌కి ఇంటికిపిలవండి. తర్వాత పనుందని బైటికెళ్ళండి. ఆయన తృప్తిపడ్డారా మీపని ఖాయం-''

కాని భార్యనొప్పించడం ఎట్లా?-

ఆమె ఆశ్చర్యపడింది.

కోప్పడింది.

ఏడ్చింది

ఈసడించుకుంది-.

సుబ్బారావు పట్టువదలలా-.

కొట్టాడు

బెదిరించాడు

ఆమెను పిల్లల్ని బజారులోకి నెడతానన్నాడు.

ఆమె లొంగలేదు-.

కాల్చాడు, వాతలుపెట్టాడు

లొంగకపోతే చంపుతానన్నాడు-.

ఒకరోజులో తేలేదికాదు.

నాల్గురోజులకు తనేలొంగుతుంది.

సుబ్బారావు విస్కీతాగుతు సేదతీర్చుకుంటున్నాడు.

లోపలినుంచి ఏడ్పువినబడుతుంది.

చేతులు నొప్పిపుడుతున్నాయి.

ఐనా లొంగలేదు.

చూద్దాం. ఎట్లా దారికిరాదో!-.

''సుబ్బారావ్''

అతనిచేతిలోని గ్లాసు జారిపోయింది-.

''ఇంతనికృష్టుడవనుకోలేదు. సిగ్గులేదూ! కట్టుకున్న దాని మానాన్ని అమ్మి సంపాదిద్దామనుకున్నావా-''

సుబ్బారావు వినలేకపోయాడు.

ఒక్కఉదుటున లేచాడు.

కోపంతో బుసలుకొట్టాడు.

బాటిల్ గోడకు విసిరికొట్టాడు.

పగిలి, తడి చిమ్మింది.

తడిసిన ఆ ఆకారం గొంతుపట్టుకున్నాడు.

ఎన్నాళ్ళనుండో చేద్దామనుకున్నపని-.

అసలా అవరోధమేలేకపోతే తనేపైనా సాధించగలడు.

తన ఆశలకు సంకెళ్ళువేస్తున్నదిదే-.

దానిగొంతు నులిమి-.

అవును గొంతునులిమి-.

మాటలు పెగలకుండ

ఊపిరాడకుండ

ఆనీడకిక ఉనికేలేకుండ చేసాడు.

తర్వాత సుబ్బారావు చాలసాధించాడు. ఎంతో ఎదిగి పోయాడు. దేశాన్ని ఏలేవాళ్ళలో చేరాడు. ప్రపంచాన్ని అమ్మడానికి పథకాలు వేసేవాళ్ళలో ఒకడయ్యాడు-.

కాని

బొట్టు నెత్తురు చిందకుండ

మరొకంటికి తెలియకుండ

జరిగిపోయిన ఆ హత్య

ఎంత ఘోరమైందని